క్లుప్తంగా

అన్నదమ్ములకు నెల రోజుల జైలు

నిడమనూరు: పాత తగాదాలను మనసులో పెట్టుకుని కర్రలతో కొట్టుకున్న ముగ్గురు సొంత అన్నదమ్ములకు ఒక నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి స్వప్న శుక్రవారం తీర్పు చెప్పారు. కోర్ట్ లైజన్ ఆఫీసర్ అలీ తెలిపిన వివరాల ప్రకారం .. తిరుమలగిరి (సాగర్) మండలం నెల్లికల్లు ఆవాస గ్రామమైన చెంచువాని తండాకు చెందిన జటావత్ హనుమ, జటావత్ పాండు, జటావత్ శివలు ముగ్గురు సొంత అన్నదమ్ములు. హనుమ, పాండు ఒక వర్గంగా శివ ఒక్కడు మరో వర్గంగా ఉన్నారు. 2016 జూన్ 1వ తేదీ సాయంత్రం 6గంటల ప్రాంతంలో గ్రామంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకుని కర్రలతో కొట్టుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదుతో ముగ్గురిపై నాటి ఎస్ రజనీకర్ రెండు కేసులు నమోదు చేశారు. శుక్రవారం కోర్టులో తుది విచారణలో నిజం నిర్ధారణ కావడంతో ముగ్గురికి నెల రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ జడ్జి స్వప్న తీర్పు చెప్పారని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామంలో విద్యుదాఘాతంతో పాడి గేదె శుక్రవారం మృతిచెందింది. బాధితుడు పందుల సైదులు తెలిపిన వివరాల ప్రకారం తన జీవనాధారమైన పాడి గేదెలను శుక్రవారం గ్రామ సమీపంలో మేతకు తోలుకెళ్లాడు. ఈ క్రమంలో గ్రామ శివారులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగలడంతో మేత మేస్తున్న పాడి గేదె విద్యుదాఘాతానికిగురై అక్కడికక్కడే మృతిచెందిందన్నారు. మృతిచెందిన పాడి గేదె సుమారు రూ.70వేలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలని సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి బొమ్మగాని ఎల్లయ్య, వడ్డెగాని సైదులు, గుడిగుంట్ల నాగరాజు, పందుల రమణయ్యలు ప్రభుత్వాన్ని కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

దేవరకొండ : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు జూలూరి వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం దేవరకొండ ఎమ్మార్సీ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మెకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మద్దతు తెలిపి ఆయన మాట్లాడారు. ప్రభుత్వమే ఉచితంగా గ్యాస్ సిలిండర్లను అందజేసి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, జంగమ్మ, ధనలక్ష్మీ, అలివేలు పాల్గొన్నారు.


భూ వివాదంలో రైతుల బైండోవర్

చింతపల్లి : మండల పరిధిలోని కుర్రంపల్లి గ్రామ శివారు సర్వే నంబర్ 68లో ఇరువర్గాల రైతుల మధ్య ఘర్షణలు తలెత్తి భూ వివాదం కోర్టు వరకు వెళ్లింది. దీంతో ముందస్తు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఇరువర్గాలకు చెందిన 9మందిని శుక్రవారం పోలీసులు తహసీల్దార్ విశాలాక్షి ఎదుట బైండోవర్ చేశారు. వివరాల ప్రకారం కిష్టరాయినిపల్లి గ్రామానికి చెందిన ముద్దం వెంకటేశ్, ముద్దం సుమతమ్మ వారి కుటుంబ సభ్యులైన కేశగోని బ్రహ్మయ్య, కేశగోని సతీష్, కేశవరం వెంకటేశ్‌లతో పాటు హైదరాబాద్‌కు చెందిన మరో వర్గమైన కాటేపల్లి శ్రీకాంత్‌రెడ్డి, కాటేపల్లి రాఘవరెడ్డి, కందాల శ్రీకాంత్‌రెడ్డి, కల్లెం సుధాకర్‌రెడ్డిలను ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా ముందస్తుగా తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పాఠశాలలో డిజిటల్ స్క్రీన్ ప్రారంభం

మాడుగులపల్లి : రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు -మన బడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆరు జెడ్పీహెచ్ఎస్‌లకు ఇటీవల మల్టీపుల్ డిజిటల్ స్క్రీన్ డివైజ్‌లు అందించింది. శుక్రవారం కన్నెకల్లు జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎం వెంకట రమణ దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రయాన్-3 రాకెట్ ప్రయోగాన్ని విద్యార్థులు వీక్షించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 8నుంచి 10వ తరగతి విద్యార్థులకు డిజిటల్ బోధన అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే.

పాడి పశువుల పెంపకంతో అధిక లాభాలు


పాడి పశువులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

చింతపల్లి : గ్రామాల్లోని రైతులు పాడి పశువులను పెంచడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చునని నల్లగొండ పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ పాశం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చింతపల్లి మండల పరిధిలోని వింజమూరులో ఆవులు, గేదెలకు కృత్రిమ గర్భాధారణ ద్వారా జన్మించిన దూడలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి పశువుల పెంపకం రైతులకు లాభదాయకమని చెప్పారు. కార్యక్రమంలో దేవరకొండ డివిజన్ గోపాల మిత్ర సూపర్‌వైజర్లు రవి పాల్గొన్నారు.

సారీ సార్.. సీట్లు లేవు!

- ఆంగ్లమాధ్యమ కేజీబీవీల్లో అడ్మిషన్లకు ఫుల్ డిమాండ్
- ప్రజాప్రతినిధులతో సిఫారసు
- సీట్ల కొరతతో తప్పని ఇబ్బందులు


కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఆంగ్లమాధ్యమం ప్రవేశపెట్టిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ)కు ఆదరణ పెరుగుతుంది. తిరుమలగిరి మండలంలోని కేజీబీవీల్లో ఆంగ్లమాధ్యమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీంతో పాటు, బాలికలు సంరక్షణకు హాస్టళ్లను కూడా ఏర్పాటు చేయడంతో పాటు ఉత్తీర్ణత శాతం కూడా వంద శాతం ఉండటంతో ఈ విద్యాలయాలకు డిమాండ్ పెరిగింది. ఇందులో అడ్మిషన్ కొరకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధుల ద్వారా పోన్లు చేయిస్తున్నారంటే ఆ చదువుకు ఎంత డిమాండ్ ఉందో మీరు అర్థం చేసుకోవచ్చు. విద్యార్థుల కొరతతో గతంలో పలు హాస్టళ్లు మూతపడగా, సంఖ్య సాకుతో ప్రభుత్వం పలు హాస్టళ్లను ఎత్తివేసిన విషయం తెలిసిందే. వీటన్నిటికి భిన్నంగా ప్రస్తుతం మారిన పరిస్థితులతో కేజీబీవీల్లో విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి ఆదరణ పెరుగుతుంది. సీట్ల కోసం పాఠశాలల చుట్టూ రోజుల తరబడి తిరుగుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తరగతికి 40 అడ్మిషన్లు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ అడ్మిషన్లు పాఠశాలలు ప్రారంభమైన రెండు, మూడు రోజుల్లోనే పూర్తవుతున్నాయి. ఆ తరువాత కూడా పదుల సంఖ్యలో వచ్చి సీటు కావాలని ప్రాదేయపడుతున్నారు. దీంతో పాఠశాల యాజమాన్యం కూడా ఒక్కో తరగతికి అదనంగా పది వరకు అవకాశం ఇస్తూ వారికి అడ్మిషన్ ఇస్తుంది. అయినా విద్యార్థిను తల్లిదండ్రులు మాత్రం పాఠశాలకు క్యూ కడుతూనే ఉన్నారు.

నూతన కేజీబీవీల్లోనే ఇంగ్లిష్ మీడియం

2016 సంవత్సరంలో తిరుమలగిరి గ్రామం మండల కేంద్రంగా ఏర్పడంతో ప్రభుత్వం నూతన మండల కేంద్రానికి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంజూరు చేసింది. నూతనంగా ఏర్పాటు చేసిన మండలాల్లోని కేజీబీవీల్లోనే ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియం ప్రారంభించింది. నూతన మండలాల్లో తప్ప మిగత మండలాల్లోని కేజీబీవీల్లో ఇంగ్లీష్ మీడియం బోధన లేదు. ఆంగ్ల మాధ్యం కావడంతో విద్యార్థులను చేర్పించటానికి వెరే వేరే మండలాలు, నియోజకవర్గాల నుంచి రావడంతో విద్యార్థుల సంఖ్య పరిమితికంటే ఎక్కువైంది. దీంతో చేసేదేమి లేక పాఠశాల ఉపాధ్యాయులు అడ్మిషన్లు పూల్ అని బోర్డు పెట్టడంతో విద్యార్థినిల తల్లిదండ్రులు వెనుదిరిగి వెళ్తున్నారు.

సౌకర్యాలు, నాణ్యమైన విద్యే కారణం

కేజీబీవీల్లో గతంలో మాదిరిగా కాకుండా రెసిడెన్షియల్ పాఠశాల తరహాలోప్రభుత్వం అర్హులైన ఉపాధ్యాయురాళ్ల ద్వారా నాణ్యమైన విద్యా బోధన చేయించడంతో పాటు అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించి మెనూ సక్రమంగా అమలు చేస్తుండటంతో ఈవిద్యాలయాలకు ఆదరణ పెరిగింది. అంతేగాకు నెలకు 4సార్లు చికెన్, 2సార్లు మటన్, 16 సార్లు కోడిగుడ్లు అందిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం పాలు, బూస్టు, టీ, రాగిజావ, ఇడ్లీ, పూరి, చపాతి, ఉక్మా వంటివి టిఫిన్‌గా విద్యార్థినులకు అందిస్తున్నారు. సాయంకాలం స్నాక్స్‌గా అటుకులు, అరటిపండు, షేమియా, గుడాలు, పల్లిపట్టి తదితరాలు అందిస్తున్నారు. వీటితో పాటు ప్రతి ఏడాది 4 జతల దుస్తులు, హెల్త్‌కిట్లు అందిస్తున్నారు. దీనికి తోడు పాఠశాలలోనే హాస్టల్ సౌకర్యం ఉండటంతో అమ్మాయిలకు రక్షణ ఉంటుందనే భావంతో తల్లిదండ్రులు ఈ పాఠశాలల వైపు మొగ్గుచూపుతున్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ప్రాజెక్టులపై వివిధ తరగతులు నిర్వహిస్తున్నారు.

రోజూ పదుల సంఖ్యలో వస్తున్నారు



సీట్ల కోసం విద్యార్థుల తల్లి దండ్రులు రోజుకు పదుల సంఖ్యలో వస్తున్నారు. ఇప్పటికే అడ్మిషన్లు పూర్తయ్యా యి. ప్రభుత్వ నిబంధనల మేరకు తరగతికి నలభై అడ్మిషన్ల వరకు మాత్రమే అవకాశం ఉంటుంది. ఎవరికి ఏమి చెప్పాలో అర్థం కావడం లేదు. చేసేదేమి లేక అడ్మిషన్లు పుల్ అని బోర్డు ఏర్పాటు చేశాం.

– కవిత, ఎస్ఓ, తిరుమలగిరి

బాధ్యతతో పనిచేసినప్పడే అభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

డిండి : ప్రజాప్రతినిదులు, అధికారులు బాధ్యతతో పనిచేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మాధవరం సునీతా జనార్దన్‌రావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జనాభా సంఖ్యకు అనుగుణంగా మిషన్‌భగీరథ నీరు సరఫరా కావడం లేదని పలు గ్రామాలలో విద్యుత్ సమస్య నెలకొన్నదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభా దృష్టికి తీసుకరాగా ఆయా శాఖాలాధికారుల పని తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామపంచాయితీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని సమ్మె కొనసాగిస్తున్న కార్మికులకు ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో రూ.20 లక్షలు ఖర్చు చేసి నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం, రూ. 20 లక్షలు ఖర్చు చేసి నిర్మించే గ్రామపంచాయితా భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 'మన ఊరు-మన ప్రభుత్వం- మన పథకాలు' పేరుతో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రస్తుతం వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం ద్వారా గ్రామానికి సంక్షేమ పథకాల పేరుతో చేసిన అభివృద్ధి ద్ధి పనుల వివరాలకు ప్రజలకు ఆయన చదివి వినిపించారు. ఎర్రగుంటపల్లిలోని ప్రభుత్వ స్థలంలో అర్హులైన వారికి తప్పకుండా ఇండ్ల పట్టాలు ఇప్పిస్తానని పేదలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దేవేందర్‌రావు, ఎంపీడీఓ గిరిబాబు, తహసీల్దార్ చంద్రశేఖర్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ఆర్‌వీఆర్, యూత్ మండలాధ్యక్షుడు మల్‌రెడ్డి విష్ణువర్దన్‌రెడ్డి, శ్రీనివాసారావు, జంగారెడ్డి, పుల్లమ్మ, జహంగీర్, వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖాల మండలాధికారులు పాల్గొన్నారు.

సమాన వేతనం ఇవ్వాలని వినతి

హాలియా : జిల్లాలోని గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పనిచేస్తున్న పార్ట్‌టైం వర్కర్లకు ఫుల్‌టైం వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొర్ర శంకర్ శుక్రవారం హాలియా పట్టణానికి వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా హాస్టళ్లలో పనిచేస్తున్న పార్ట్ టైం వర్కర్లకు రోజు 10 గంటలు పనిచేసిన వారికి ఇచ్చే వేతనం రూ.5వేలు మాత్రమేనన్నారు. ఫుల్ టైంగా పని చేసే వారికి సమానంగా పార్ట్‌టైం వర్కర్లకు వేతనాలు అందించాలని కోరారు.

సమగ్ర గ్రామీణ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే నోముల భగత్


మక్కపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భగత్

గుర్రంపోడు : గ్రామ సమస్యల సత్వర పరిష్కారం, గ్రామీణ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం 'మన ఊరు -మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. శుక్రవారం మండలంలోని మక్కపల్లి గ్రామంలో మన ఊరు-మన ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీ పరిధిలోని పార్లపల్లి, కొత్తగూడెం గ్రామాలలో రూ.20లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అయా గ్రామాలలోని వీధుల్లో తిరుగుతూ ప్రజలను పలకరిస్తు, గ్రామంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరడంతో వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈతో ఫోన్‌లో మాట్లాడి తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామానికి 7హెచ్‌పీ మోటార్‌ను మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీకి రూ.30 నుంచి 50లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాంతం వెనకబాటుకు కాంగ్రెస్ పార్టీనే కారణమని, వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలన్న కాంగ్రెస్‌కు రాబోయే ఎన్నికల్లో బొంద పెట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ వజ్జ రామేశ్వరీధనుంజయ, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జెల చెన్నారెడ్డి, నాయకులు రామగిరి చంద్రశేఖర్‌రావు, సర్పంచ్ బాల్‌రెడ్డి, సింగం ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ దోటి చంద్రమౌళి, చాడ చక్రవర్తి, భాస్కర్, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి


అడవిదేవులపల్లిలో సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి


త్రిపురారంలో పంచాయతీ కార్మికుల ధర్నాకు మద్దతు తెలిపిన జైవీర్‌రెడ్డి

అడవిదేవులపల్లి : గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు వారి వేతనాలను ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం అడవిదేవులపల్లి మండల పరిషత్ కార్యాలయం అవరణలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు సీపీఎం సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పీఆర్‌సిలో నిర్ణయించి ఆ బెన్‌ఫిట్‌కు ఉన్న రూ.19వేల చెల్లించాలన్నారు. జీఓ 60 ప్రకారం స్వీపర్లకు 15,600, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రికల్ , డ్రైవర్లు, కారోబారు బిల్ కలెక్టర్లకు రూ.19,500నిర్ణయించి కారోబార్ కలెక్టర్లకు సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. రోజుకు 8గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లు గౌతమ్‌రెడ్డి, జటంగి సైదులు, కుర్ర శివనాయక్, హనుమంతు, సర్వయ్య, రంగారాంబాబు, కోటి, రామాంజనేయులు, పాత్య మునీ, నాగ తదితరులున్నారు.

మాడుగులపల్లి : పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు శుక్రవారం మద్దతు ప్రకటించి ఆయన మాట్లాడారు. కార్మికుల పక్షాన సీపీఎం నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి పుల్లెంల శ్రీకర్, మండల కమిటీ సభ్యులు పతాని శ్రీను, రమేష్, సైదులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వేములపల్లి : పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికులకు సీపీఎం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాదూరి గోవర్దని, సీపీఎం మండల నాయకులు రొండి శ్రీనివాస్, పాల్వాయి రాంరెడ్డి, ప్రణీత్‌రెడ్డి, పతాని శ్రీను, వడ్డెగాని సైదులు, ఏసు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం చేయాలి

త్రిపురారం : పంచాయతీ కార్మికులకు న్యాయమైన డిమాండ్లను బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చే వరకు పోరాటం చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో కార్మికులు, ఉద్యోగులు నానా అవస్థలు పడుతున్నారు. అనంతరం పంచాయతీ కార్మికులు ఎంపీపీ అనుముల పాండమ్మతో పాటుగా ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పోలె సాంబయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ఎంపీపీ సలహదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, ఐఎన్‌టీయూసి జిల్లా అధ్యక్షుడు సోమయ్య, కోఆప్షన్ హుస్సేన్, జానయ్య పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె

కొండమల్లేపల్లి : గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం 9వ రోజుకు మండల కేంద్రంలో కొనసాగింది. ఈ సందర్భంగా మద్దతు తెలిపిన ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని, జీఓ నంబర్ 60 ప్రకారం ఉద్యోగులకు రూ.19,500 వేతనం, పారిశుద్ధ్య కార్మికులకు రూ.15,600 వేతనం అందించాలని, రూ.10లక్షల ప్రమాద బీమా వర్తింపజేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెంకట్రాములు, కార్మికులు కోట్ల సతీష్, అందుగుల ప్రవీణ్, లక్ష్మణ్, వెంకటయ్య పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సాదాసీదాగా సాగింది. ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం పూర్తి స్థాయిలో హాజరుకాలేదు. దీంతో సమావేశం మొక్కుబడిగా సాగింది. సుమారు 20 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా సగం మంది అధికారులు హాజరైనప్పటికీ సమావేశానికి నివేదికలు సైతం అందించలేకపోయారు. హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు చొరవ చూపడం లేదనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు కూడా హాజరు కాలేదు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. సమావేశంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, తహసీల్దార్ లాల్ బహదూర్, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, వైస్ ఎంపీపీ సరితా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనుల అడ్డగింత


వివరాలను తెలుసుకుంటున్న ట్రైనీ ఐపీఎస్ శేషాద్రినిరెడ్డి, ఎస్ఐ

కొండమల్లేపల్లి : మండలంలోని గౌరికుంటతండాలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలు, జెడ్పీటీసీ నిధులు రూ.5లక్షలతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను శుక్రవారం జేసీ సాయంతో చేపడతున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన వార్డు మెంబర్ డ్రెయినేజీ నిర్మానంతో తన పొలంలోకి మురుగు నీరు వస్తుందని వాదనకు దిగి పనులను అడ్డుకున్నాడు. గ్రామ సర్పంచ్ రాజేశ్వరీ ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న ట్రైనీ ఐపీఎస్ శేషాద్రినిరెడ్డి, ఎస్ఐ వీరబాబు వార్డు మెంబర్‌తో మాట్లాడి నచ్చజెప్పడంతో పనులు యథావిధిగా కొనసాగించారు. వీరి వెంట ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, వీఆర్ఏ రవి, పంచాయతీరాజ్ ఏఈ ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీగా బాధ్యతలు స్వీకరణ


డీఎస్పీ గిరిబాబు

దేవరకొండ : దేవరకొండ డీ ఎస్పీగా గిరిబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన డీఎస్పీ నాగేశ్వర్‌రావు బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి డీఎస్పీగా పని చేస్తున్న గిరిబాబు బదిలీపై దేవరకొండకు వచ్చారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు డీఎస్పీ గిరిబాబుకు స్వాగతం పలికారు. డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు.

టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

నిడమనూరు : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు శుక్రవారం మండలంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి అలుపెరగని పోరాటం టీఎస్‌యూటీఎఫ్ చేస్తుందన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వంలో కదలిక తేవడానికి అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఐక్య పోరాటం చేయడానికి కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. బక్కా శ్రీనివాస చారి, రాంబాబు, సురేందర్ రెడ్డి, సైదులు, అంజయ్య, ఉపేందర్, సైదిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థి ఉన్నత చదువులకు ఆర్థిక సాయం

హాలియా : ఉన్నత చదువుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పెద్దవూర మండలంలోని బాసోవితండాకు చెందిన గిరిజన విద్యార్థి హనుమునాయక్‌కు శుక్రవారం స్థానికంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్ ఆర్థిక సాయం అందించారు. బాసోవితండాకు చెందిన హనుము నాయక్ ఇటీవల ఎంబీబీఎస్ నీట్‌లో క్వాలీఫై అయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని రంజిత్ యాదవ్ తెలుసుకుని తనవంతుగా ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కోమటికుంట తండా సర్పంచ్ బాణావత్ శంకర్‌నాయక్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు రమావత్ రవినాయక్, మకట్‌లాల్, నాయకులు అర్జున్ నాయక్, గురజాల సైదులు తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి గ్రామస్తుల చేయూత

మాడుగులపల్లి : మండల కేంద్రానికి చెందిన నిరుపేద నాగుల్‌మీరా అనారోగ్యంతో వారం క్రితం మృతి చెందాడు. గ్రామస్తులు, స్థానిక నాయకులు పెద్ద మనసుతో తోచినంత ఇచ్చి రూ. 64,177 పోగు చేసి శుక్రవారం మృతుడి కుటుంబానికి అందించారు. చికెన్ సెంటర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న నాగుల్ మీరా మృతి చెందడంతో ఆ కుటుంబానికి అండగా నిలవాలన్న సంకల్పంతో సాయం అందించామని దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరూరి నరేష్, పుల్లెంల ఏడుకొండలు, పగిడిమర్రి నాగేందర్, నకిరేకంటి నరేష్, గురువయ్య, వెంకటయ్య, సైదులు, సైద, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

చింతపల్లి : మండల కేంద్రంలో నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల ఆంజనేయులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మండల కేంద్రంలోని నాగార్జున గ్రామర్ హై స్కూల్, మాత్రు శ్రీ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కనీస మౌలిక వసతులు కల్పించడం లేదన్నారు. అర్హత లేని ఉపాధ్యాయులను నియమిస్తున్నారని ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు వినయ్‌కుమార్, అర్జున్, వి.శ్రీకాంత్, సాయి, శివకుమార్, శివ పాల్గొన్నారు.

ఫీడర్ చానల్‌లో పూడిక తీయించిన అధికారులు

వేములపల్లి : మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడెం శివారు నుంచి చిన్న చెరువుకు వెళ్లే ఫీడర్ చానల్ పూర్తిగా పూడిపోయి వర్షాలు కురిసి వరద వచ్చినప్పుడు పొలాలు దెబ్బ తింటున్నాయి. ఏండ్లుగా ఇదే తంతు కొనసాగుతుండడంతో విసిగిపోయిన స్థానిక రైతులు ఇటీవల విషయాన్ని డీఈ జనార్దన్, ఏఈ సాయిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించారు. శుక్రవారం పూడికను జేసీబీ సాయంతో తొలగించి గట్లను పటిష్ఠం చేశారు. ఎవరైనా ఫీడర్ చానల్ (వాగును) పూడ్చినా.. గట్లను ఆక్రమించినా నీటి పారుదల చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, కానిస్టేబుల్ మదార్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కార్యవర్గం ఎన్నిక

మిర్యాలగూడ టౌన్ : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఆ సమితి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామాంజీ సైదులు ప్రకటించారు. ఎమ్మార్పీఎస్-టీఎస్ మండల అధ్యక్షుడిగా ఇంద్రపల్లి శ్రీనివాస్ మాదిగ, ఉపాధ్యక్షులు నూకపంగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పరంగి రంజీత్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా తక్కెళ్ల శ్రీను, చంద్రయ్య, కార్య నిర్వాహక కార్యదర్శిగా చిలుముల పరమేశ్ మాదిగలతో పాటు రామాంజి పెద సైదులు నరేష్, సైదులు, కలకొండ చంద్రమౌళి, జిల్లా శ్రీను, నగేష్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తుంగపాడు సర్పంచ్ మచ్చ వెంకన్న, కాశయ్య, హనూక్, సైదులు, లక్ష్మణ్, రాంబాబు, నాగరాజు పాల్గొన్నారు.

నాట్కోట్రస్టు సేవలు అభినందనీయం


జమ్మనకోట పాఠశాలకు డెస్క్ బెంచీలు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, పేద విద్యార్థులకు కొన్నేళ్లుగా నాట్కో ట్రస్టు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని జమ్మనకోట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని జమ్మనకోట పాఠశాలకు నాట్కోట్రస్టు ఆధ్వర్యంలో డెస్క్ బెంచీలను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులను పాఠశాల ఉపాధ్యాయ బృందం సన్మానించి, అభినందించింది. కార్యక్రమంలో నాట్కోట్రస్టు ప్రతినిధులు జీఎల్ ఎస్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు భాషా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు పూజలు


తిరుమలగిరి : మల్లప్పస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న రైతులు


రాగడపలో గ్రామ దేవతలకు బోనాలు తీసుకెళ్తున్న యువతులు, మహిళలు

త్రిపురారం : సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండాలని మండలంలోని రాగపడ గ్రామంలోని యువతులు, మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి శుక్రవారం గ్రామ దేవతలకు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని తేజం స్కూల్ విద్యార్థులు వివిధ గ్రామ దేవతల వేషధారణలతో గ్రామస్తులతో కలిసి ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల గ్రామ దేవతల వేషధారణలు గ్రామస్తుల అందరిని ఆకట్టుకున్నాయి.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : వర్షాలు కురవాలని మండలంలోని సుంకిశాలతండా గ్రామస్తులు శుక్రవారం రాజవరం శివారులోని పురాతనమైన మల్లప్పాయ శివాలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతిరామకృష్ణ నాయక్, సోమ్లా, హనుమంతు, పాల్గొన్నారు.